


# కాకిగోడు

హోతాశ్రీ

సూర్యుడు పొవ క్రసిల్లిన వేళ.

కాకుల గుంపుల్లా మబ్బులు ఆకాశాన్ని కమ్ముకొస్తున్నాయ్.
మామిడిచెట్టుమీది కోయిల సన్నాయినొక్కు నొక్కింది.
వెంటనే వేపచెట్టుమీది కాకులగుంపు ఒకటే రొద చేయసాగింది.
టపటప మన్నాయ్ చినుకులు.

రఘు చప్పున ఆ ఇంటి వరండా చేరుకున్నాడు. కిటికీ ఝుమ్మికి గొలుసుతో కట్టివేయబడిన ఓ మియా బొబా అంది.

తలుపులు కిర్రుమన్నాయి. డోర్ కర్టెన్ తొలగింది. టపటపరాలే చినుకుల్ని చూస్తూ జేబురుమాలుతో ముఖం తుడుచుకుంటున్న రఘు వెనక్కి తిరిగాడు.

"ఎవరు?"

ధ్వని వచ్చినవైపు చప్పున తలెత్తి చూశాడు రఘు.

ఆమే అతనివైపు చూసింది.

"ఓ మీరేనా! జ్ఞాపకం ఉన్నానా?" అన్నాడతను. ఆమె కళ్ళల్లో క్షణం గోచరించిన ప్రశ్నార్థకం మాయమై మందహాసం ఆమె పెదవుల్ని అలంకరించింది. అతని ప్రశ్నకి జవాబివ్వకుండా కర్టెన్ పూర్తిగా పక్కకినెట్టి "ఇలా వచ్చి కూర్చోండి" అందామె. ఈ ఆదరం చూసి టామీ నోరుమూసుకుంది. రఘు చెప్పులు బయట విడిచి లోపలికి వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు.

సన్నగా వినిపిస్తున్న రేడియో నోరు కట్టేసిందామె.

"యమెటిక్‌గా ఇలా వచ్చాను సుమండీ."

"అంతేనా?"

"ఏముందీ! ఈ ఊరొచ్చి మిమ్మల్ని చూడకుండా వెళ్ళిపోబోతుంటే వరుణుడికి కోపం వచ్చి ఆ చెంపా ఈ చెంపా వాయించేకాడు. గత్యంతరం లేక శరణన్నాను. అంతే."

ఆమె నవ్వింది.

"గత్యంతరంలేక వచ్చారన్నమాట."

అతను వెంటనే నాలిక కొరుక్కున్నాను.

"అబ్బే. అది కాదండీ. మీకు జ్ఞాపకం ఉన్నానో లేదోనని సందేహించాను."

"అంత కృతఘ్నురాలిని కాదులెండి."

అబ్బెబ్బె. అదికాదండీ రేఖగారూ. రెండేళ్ళు గడచిపోయాయా! ఒకటి రెండుసార్లుమాత్రం చూసినవ్యక్తి ఇంత కాలం జ్ఞాపకం ఉండక పోవొచ్చు కదూ?"

"మీరు ఇంచుమించు మమ్మల్ని మర్చిపోయారని చాలా తెలివిగా సూచిస్తున్నారులెండి" అంది రేఖ, అతన్ని మరీ ఇబ్బందిపెడుతూ. రఘు ప్రత్యుత్తరంగా ఓ చిరునవ్వు నవ్వాడు.

"అదికాదండీ. ఆ సంఘటన జరిగిన తరవాత ఒక్కసారేకదూ మనం కల్సుకున్నాం. ఆ తర్వాత కొద్దిరోజులకే నేను పట్నంవిడిచి మా స్వగ్రామం చేరుకొన్నాను. పరిస్థితుల వత్తిడివల్ల మళ్ళీ ఇలా రావడం పడనేలేదు. రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. మీ వ్యాపకాల్లో మీరుఉండివుంటారుకదా! అదీకాక, జ్ఞాపకంపెట్టుకోటానికి నేను చేసిన ఘనకార్య మేముందండీ" సంజాయిషీ చెప్పుకొంటున్నట్టుగా అన్నాడు రఘు.

"ఇంకా నయం. ఆ రాత్రి మీరు దేవుడిలావచ్చి సహాయపడకపోతే ఆ దుర్మార్గుడు ఏంచేసేవాడో."

గతాన్ని ఆమె స్మృతిలోకి తెచ్చుకుంది. ఆమె ప్రశంసకి రఘు ముఖం కొంచెం ఎర్రబారింది. విషయాన్ని మారుస్తు, అతనన్నాడు—"మీ నాన్నగారు ఇంట్లో లేరా?"

"ఉన్నారండీ. నాన్నగారు ఫోను దగ్గిర పీఠం వేసేశారు."

"ఫోను దగ్గిరా? ఎందుకు?"

"మీకు తెలియదా ? నాన్నగారు ఎం. ఎ. కాబోతున్నా రండోయ్. ఓట్లు లెక్క డుతున్నార్ట. ఇప్పటిదా నాన్నగారి ద మెజార్టీ ట."

ఆమె సంబరపడుతూ గబగబా అనేసింది. కాని, రఘు ఆ విషయంపట్ల అం ఆసక్తి చూపకుండా, "అలాగా?" అనిమాత్రం అన్నాడు.

"అన్నట్టు మీ దే రండీ ?" రేఖ అడిగింది.

"ఈ తాలూకాలో కొత్తపాలెం."

"మరి మీవూరుకూడా మా నాన్న గారి నియోజకవర్గంలో దేక ండీ! మరి తెలియనట్టు మాట్లాడతారేం ? మ ్ని పూర్తిగా మర్చి పోయినట్లున్నమాట.

ఆమె చిన్నబుచ్చు కున్నట్టు రఘు కనిపెట్టాడు. "అదికాదండీ. రాజకీయాల్లో నాకంత అభిరుచిలేదు. మీ నాన్నగారు అభ్యర్థిగా నిలబడ్డారని నాకు తెలుసు. ఇవాళ ఓట్లు లెక్క పెడ్తారనేవిషయం నా కసలు గుర్తే లేదుసుమండీ."

"అదేమిటండీ? ఈ రోజుల్లో ఎవరి నోటవిన్నా ఎలెక్షన్లగొడవలేకదా! ఎం.ఏ. ప్యాసై, అన్నివిషయాలూ తెలుసుకునీ, మీరు దేశంసంగతి ఏమీ పట్టించు కోటంలేదన్నమాట !"

రఘు నవ్వాడు.

"బాగుంది. ఆ అవకాశం నాయకులు మనదాకా రానిస్తారా ?"

"నాయకుల్ని అ పోసుకుంటా రేమండీ" మీరంతా ఓటిస్తే వాళ్ళు నాయకులయారా, కవాళ్ళంతట వాళ్ళే సింహాసనమెక్కి నేతలమని ప్రకటించుకున్నారా?

"తప్పుమనదే"

"మనదే కాదు విండీ, మీలాంటి వాళ్ళదే నాకింకా ఓ లేదండోయ్"

ఇద్దరూనవ్వారు.

"వోటింగు హక్కు వచ్చేసరికి మీరూ ఓఅభ్యర్థిని ఐ ేతారు చూస్తూ ఉండండి."



"అప్పుడు మీ ఓటు నాకే ఇస్తానని మాటివ్వండి."

"మాటవేరు ఓటు వేరండోయ్"

"అంటే"

"మాట ఇచ్చినంత మాత్రాన ఓటు వస్తుందనుకోటం భ్రమ"

"ఓహెూ! ఇప్పుడుకూడా మీరు అలాగే చేశారా"

రఘు చిన్నగా నవ్వి ఆ ప్రశ్నకి జవాబివ్వకుండా తప్పించు కుంటూ అన్నాడు. "అధికారమంటే మీకూ మోజు బాగా ఉన్నట్టుంది"

"లేనిదెవరికి చెప్పండి. లేదంటే మనసులో మాట కాదన్నమాటే"

"మీనాన్నగారు ఎం. పి. అయితే మీకు రాజకీయాల్లో మంచి ట్రెయినింగ్ ఇస్తారులెండి. తప్పక మినిష్టరై పోతారు. ఇంక మాలాంటి వాళ్ళం జ్ఞాపకం ఉండం" రేఖ ముఖం ఆ పొగడ్తకి వికసించింది.

"చేసిన మేలు మర్చిపోతామా? మిమ్మల్ని పి. ఏ. గా వేసుకుంటాను కదూ"

రఘు లోలోపల నవ్వుకున్నాడు. రేఖ మాటల్లో రాజసం ఉట్టిపడుతూనే ఉంటుంది. తనతో పరిచయం స్వల్ప మైనదే అయినా ఆమె స్వేచ్ఛగా సహజధోరణిలో మాట్లాడటం అతనికి నచ్చింది. మొదటిసారికూడా ఆమె అలాగే మాట్లాడింది. తనే చనువు తీసుకోలేక పోయాడు.


"థాంక్స్."

"నో మెన్షన్"

"ఇంక మాట్లాడానికేం విషయాలున్నాయో" రఘు ఆలోచించసాగాడు.

రేఖ కిటికీ కర్టెన్ తొలగించి బయటికి చూసింది.

"వర్షంఎప్పుడు తగ్గుతుందా, ఎప్పుడు ఈన్యూసెన్సు వొదుల్తుందా అనిచూస్తున్నట్టున్నారు."




"నాకు వర్షమంటే యిష్టమండీ. తగ్గాలని ఎప్పుడూ అనుకోను."

రఘు చకితుడైనాడు. ఆ విధంగా ఆమె తన మాటల్ని తిప్పికొడుతుందని అతను వూహించలేదు. అతని అవస్థ చూసి రేఖ నవ్వింది. ఇంతలో గాలి విసురికి ఆమె ముఖంమీద వానజల్లు కొట్టింది.

"జల్లుపడ్తోంది. ఏమిటలా కిటికీ దగ్గరనుంచున్నారు?"

"కారు వస్తుందేమోనని చూస్తున్నాను."

"కారా !"

"అవునండీ. మిమ్మల్ని పంపించటానికి కాదులెండి. మా అన్నయ్య వస్తున్నాడేమోనని చూస్తున్నాను."

"మీఅన్నయ్య ఇక్కడే ఉన్నారా? ఏదో టెక్నాలజీ చదువుతున్నారని చెప్పారు పూర్వం."

"అవునండీ. ఇక్కడ చదువైపోయింది. ఫారిన్ పోతాట్ట. స్కాలర్ షిప్ కోసం ట్రై చేస్తున్నాడు. ఇన్ ఫ్లుయెన్సు వుండాలట. మా నాన్నగారు ఎం. పి. అయితే ఛాన్సు. అయితే ఏమిటి లెండి. అయినట్టే - హండ్రెడ్ పర్సెంట్."

రఘు లేచి నుంచుని కిటికీవైపు వెళ్ళాడు. మేఘాలు మరీ విజృంభిస్తున్నాయి.

"ఈ వర్షంలో ఆయన ఎక్కడికి వెళ్ళారు?"

"ఓట్ల కౌంటింగ్ జరుగుతోంది కదండీ. ఇంతలో మర్చిపోయారా ?"

"ఓహెూ ! అవును" అన్నాడు రఘు తన మతిమరుపుని నిందించుకుంటున్నట్టుగా.

"ఇంతకీ అడగటం మర్చిపోయాను. మీ ఓటు మా నాన్నగారి కివ్వలేదు కదూ ?"

అకస్మాత్తుగా జ్ఞప్తికివచ్చినట్టుగా రేఖ అడిగింది.

రఘు ఆమె వదనంలోకి విస్మయంగా చూశాడు.

"ఓటింగ్ కంపార్ట్ మెంట్ లో వున్నట్టే మాట్లాడుతున్నారే."

"అవునా, కాదా ? చెప్పండి."

"ఓటింగ్ సీక్రెసీ కాపాడటం మీ విధి, నా విధి, అందరి విధి."

అడిగిన ప్రశ్నకి జవాబివ్వకుండా రఘు తెలివిగా తప్పించుకోటం కనిపెట్టి రేఖ నవ్వుకుంది.

"అమ్మాయ్, రేఖా !" లో పల్నించి కేక వినిపించింది.

"నాన్నగారు పిలుస్తున్నా... మీరు వచ్చారని చెబితే సంతోషిస్తారు. ఇప్పుడేవస్తా నుండండి" అంటూ రేఖ వెంటనే లోపలి కెళ్ళింది.

రఘు హాలు నాలుగమూలలా చూస్తూ కిటికీనుంచి సోఫాదగ్గరికి నెమ్మదిగా అడుగులు వేశాడు. రేడియో గ్రాం, పియానో, స్టీల్ ఫర్నిచర్, సోఫాసెట్టూ అతని దృష్టిని ఆకర్షించాయ్. జనార్దనం కలవాడు. అందువల్లే ఎన్నికల్లో డబ్బు వర్షంలా కుమ్మరించాడు. అందరూ గెలుస్తాడనే అంటున్నారు. గెలిచినా, ఓడినా తనకి ఒరిగేదేమీ లేదు. కాని... ... ..

రఘు ఆలోచనలకి అంతరాయం కలిగింది.

"హల్లో మిష్టర్ రఘూ!" త్వర త్వరగా వస్తూ ఎంతో ఆప్యాయంగా జనార్దనం అతనితో కరస్పర్శ చేశాడు.

పొందూరు ఖద్దరులాల్చీ ధోవతీ, బట్టతలమీద అక్కడక్కడ నెరిసిన వెంట్రుకలు, పచ్చటి దేహచ్ఛాయ— జనార్దనం నిండైన మనిషి. రఘు ఆయన వైపు ఆదరంగాచూసి నమస్కరించాడు.

"కూర్చోవోయ్, కూర్చో. ఏమిటి విశేషం?"

"విశేషమేముందినాన్నా. వర్షంకురుస్తుంటే తడిసి పోతాననే భయంతో ఈగూట్లో చేరారు. అంతే వెనకే వచ్చిన రేఖనవ్వుతూ రఘువైపు చూసింది.

"అదేమిటోయ్, మాట మాత్రం చెప్పకుండా అలా వెళ్ళాయిం చేశావు. నీ కోసం ఒకటి రెండు సార్లు కబురుకూడా చేశాను"

"క్షమించండి. మా నాన్నగారు అకస్మాత్తుగా పోవటంవల్ల ఇంటి పరిస్థితులు చూచుకోటానికి ఇక్కడ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోవలసివచ్చింది. మీతో చెప్పి వెళ్ళటానికిక్కూడా వ్యవధి లేకపోయింది. అప్పటినుంచీ ఇటురావటానికే వీలుపడలేదు."

తనపట్ల జనార్దనం చూపిన శ్రద్ధాసక్తులకి కొంత ఆశ్చర్యపడుతూనే క్షమాపణ కోరుకుంటున్నట్టుగాఅన్నాడు రఘు.

"అంత తీరుబడి లేకపోవటానికి ఏం వ్యవహారాలున్నాయ్ నీకు?"

"లేకేమండీ, పొలం-పుట్రా చూసుకోవాలిగా! ఇంక కుటుంబవ్యవహారాలసంగతి సరేసరి."

"అలాగా. అమ్మాయ్! రఘుకి కాఫీ ఇచ్చావా?" రేఖవైపుచూశాడు జనార్దనం ఆమె నాలిక కొరుక్కుంది.

"అక్కర్లే, ఇప్పుడెందుకండీ?" అన్నాడు రఘు.

"అదేమిటోయ్. అలా మొహమాటపడతావేం? కాఫీ తెప్పించమ్మాయ్" అన్నాడు జనార్దనం. రేఖ లోపలికి వెళ్ళింది.

"మీకు శ్రమ యిస్తున్నాను."

"శ్రమా!" జనార్దనం గట్టిగా "శ్రమేమిటోయ్. ఏంచేస్తే నీ ఋణం తీర్చుకోగలం."

రఘు కొంచెం బిడియపడ్డాడు.

"నేను చేసిందేముందండీ? సమయానికి నేను లేకపోయినా గొలుసులాగి, రైలాపి, రేఖ ఆ దుర్మార్గుడిబారి నుండి తప్పించుకునేవారే."

"అలాంటి విపత్సమయంలో సమయస్ఫూర్తి వుండటం కష్టం గదుటోయ్. అసలే అది బేల. అందులో హఠాత్తుగా ఏదైనా, ఉపద్రవం సంభవిస్తే అసలేతట్టుకోలేదు. చదువుకున్న దన్నమాటేగాని, ఏమాత్రం లోకవ్యవహారంతెలీదు. లేకపోతే ఒక్కతే సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో రాత్రిపూట ప్రయాణం చేస్తుంటే డోర్ లాక్ చెయ్యదుటోయ్. ఎబ్బే ప్చ్. అసలులాక్ ఉంటుందనే దానికితెలీదు."

రేఖ తెలివితేటల మీద అలా రిమార్క్ ప్యాస్‌చేసిన జనార్దనంవైపు మందస్మిత వదనంతో చూసి రఘు ఆమెకి వత్తాసు పుచ్చుకొన్నాడు.

"అహఁ-సామాన్యంగా ఇలాంటివి జరగవు కదండీ. నిజానికి ఆమె ధైర్యాన్ని ప్రశంసించవలసిందే. కొంత మంది ఇల్లువదిలి కాలు అవతలకి పెట్టలేరు. అలాంటిది ధైర్యంగా ఒంటరిగా ప్రయాణంచేస్తూ అలాంటి దుర్ఘటన జరిగినప్పుడు మూర్ఛపోకుండా తెలివిగా నిర్భయంగా సహాయంకోసం గట్టిగా కేకలు వేయటం అందరూ చెయ్యగలరా? మరొకరికైతే పైప్రాణాలుపైనే ఎగిరిపోయేవి."

"కొంత గుడ్డిలో మెల్లలే. అలా కేకలువేయబట్టి, సమయానికి నువ్వు పక్కకంపార్ట్‌మెంట్‌లో ఉండి ఆదుకోబట్టీ మాపిల్లమాకు దక్కింది."

"కాని ఎంతధైర్యం చేశాడండీ రాస్కెల్. మొదటినుంచీ కన్నువేసే ఉన్నట్టున్నాడు. పక్కనఉన్న థర్డ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ నుంచి ఎవరో నడుస్తుంటం యధాలాపంగా చూశాను. అప్పుడే అనుమానం తట్టింది. డోర్ దగ్గరనిలబడి చూశాను కదండీ. కేకలు సన్నగా వినిపించాయి. సహాయం వస్తుందని వాడు కలలో కూడా అనుకుని వుండడు. అమాంతం గొంతు పట్టుకునేసరికి తల్లడిల్లి పోయాడు వెధవ. వాడిని గార్డ్‌కి వప్పచెప్పే దాకా పాపం రేఖ వణికి పోయింది. దేవం మనపట్ల ఉన్నాడులెండి,ఇంతకీ".

కాఫీ ట్రేతో వస్తున్న రేఖ చివరి మాటలువింది.

"అబ్బ, ఆసంఘటన జ్ఞాపకంవస్తే ఇప్పటికీ వణుకు పుట్టుకొస్తుందండీ." ఆమె ముఖంలో భయం తాండవించింది.

"చెప్తేవిన్నావా? ఎవరో ముఖ్య స్నేహితురాలు పెళ్ళిఅనీ, వెళ్ళక తప్పదనీ పేచీపెట్టాడు. తిరిగి వచ్చేటప్పుడు రాత్రి ప్రయాణం! అందులో మెయిల్. దైవవశాత్తు రఘుఅండగా నిలిచాడు గనుక సరిపోయింది. లేకపోతే—?

ప్రశ్నార్థకం వేశాడు జనార్దనం, అప్పటికోపం మళ్ళీ తెచ్చుకుంటూ.

"అక్కడికి ఫస్ట్‌క్లాసులో ఒంటరిగా రావలసివస్తోందని సెకండ్ క్లాసు టిక్కెట్టే కొన్నాను" అంది రేఖ.

"గత జల సేతుబంధనం దేనికిలెండి" అన్నాడు రఘు.

"అసలు సెకండ్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ పక్కన థర్డ్‌క్లాస్ వెయ్యటమేమిటండీ? గవర్నమెంట్‌కి ఆమాత్రం తెలియక్కర్లే? నేను ఎం. పి. కాగానే మొట్టమొదట ఈ విషయం ఫిర్యాదు చేసి వెంటనే ఆ పద్ధతి మార్పు చేస్తాను" అన్నాడు జనార్దనం.

"మెజారిటీ ఎంత నాన్నా?" కాఫీ కప్పులుఇస్తూ రేఖ అడిగింది.

"క్లోజ్‌గానే ఉందమ్మాయ్. ఇంక లెక్క పెట్టాలిసినవి ఎన్నోలేవు. అవి మనకేవస్తే గట్టెక్కినట్టే. వస్తాయని బాగా నమ్మకంగా ఉందిలే"

"లెక్కపెట్టాల్సినవి ఏవూళ్ళఓట్లు?"

"మన తాలూకావే. ఫోన్ కనెక్షన్ పోయింది. మనవాడొస్తేగాని సమాచారం తెలియదు. అబ్బ! వెధవ వర్షం. సమయానికి తగులుకుంది. ఏ



చెట్టో విరిగి టెలిఫోన్ వైర్స్ మీద పడ్డది కాబోలు. డామిట్." జనార్దనం విసుక్కున్నాడు.

"ఏమిటో పాడువర్షం" రేఖకి కూడా కోపం వచ్చింది.

"అకాలంలో వచ్చిందికూడా, దరిద్రపువాన."

వస్తున్న నవ్వుని నొక్కిపట్టి, శృతి కలిపాడు రఘు.

"ఘురేమిటోయ్ విశేషాలు?" జనార్దనం అడిగాడు.

"ఏమున్నాయండీ, మామూలే."

"ఇంతకాలం అజ్ఞాతవాసంలో వుండి ఇప్పుడు యీ ఊరికి హఠాత్తుగా రావటానికి కారణ మేదో వుంటుందిగా."

"కుటుంబ వ్యవహారాలన్నీ సర్దుబాటయాయండీ. పొలం కౌలు కిచ్చేశాను. ఇక్కడో ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాను. ఇవాళ ఇంటర్వ్యూకి రమ్మని పిలుపు వచ్చింది. ఐపోయింది. ఇంక తిరిగిపోయే సన్నాహంలో వున్నాను." రఘు టూకీగా చెప్పాడు.

"అదా సంగతి! ఉద్యోగంవస్తుందా?"

"రావచ్చండి."

"లేకపోతే చెప్పు. ఇన్‌ఫ్లుయెన్స్ చేద్దాం."

"ఎం. పి. అయింతరువాత యిహ మీకిదే పనిలెండి!" అంది రేఖ నవ్వుతూ.

"సరే, ఏదో ఉపకారం చేతైంది చెయ్యక తప్పుతుందా? అసలింతకీ ఏమౌతుందో!"

ఎం. పి. అయినట్టే ఊహించుకున్న జనార్దనం ఉత్సాహాన్ని పైకి కనబడనీయకుండా అపివేస్తూ అన్నాడు.

వర్షపుజోరు కొద్దిగా తగ్గింది.

"ఏదైనా రిక్షా దొరికితే బావుండును. ట్రెయిన్ టైమవుతోంది." చేతిగడియారం చూసుకుంటూఅన్నాడు రఘు.


"ఎందుకూ? మా ప్రకాశ్ వచ్చే వేళయింది. వాడు రాగానే కార్లో దిగబెడతాడు. ఐనా తొందరేవిటి? ఇక్కడే యాపూట వుండిపో. ఉదయం బైల్దేరవచ్చు" అన్నాడు జనార్దనం.

"అవునండీ, ఈ వర్షంలో ఎలా వెడతారు?" అంది రేఖ.

"కాదండీ. వర్షం కాస్త తగ్గగానే వెళ్ళాలి. ఈ సారికి క్షమించండి."

రఘు మొహమాటపడసాగాడు.

"ఫరవాలేదులేవోయ్. ఇలాంటిముఖ్య సమయంలో నువ్వు వుండాలి. ఇంకా ఎం. పి. కాకపోయినా, ఆ హెూదా లభించినట్టుగానే జనార్దనం ఉత్సాహ పడుతూ బలవంతం చేశాడు. రఘు మాత్రం "కాదండీ" అంటూనే ఉన్నాడు. ఇంతలో కారు హారన్ మోగింది.



"అన్నయ్య వచ్చేశాడు" రేఖ ద్వారం దగ్గరకి పరిగెత్తింది. జనార్దనం ఆతృతగా ఆమెను అనుసరించాడు. అప్రయత్నంగా రఘు లేచి నిలుచున్నాడు. కొద్దిక్షణాల్లో ప్రకాశ్ రానే వచ్చాడు. అతని ముఖం వాడిపోయి వుంది.

"ప్చ్. కొద్దితేడాతో పోయింది నాన్నా. జస్ట్ త్రీ ట్వెంటీ టూ ఓట్స్ ప్చ్" హీనస్వరంతో అన్నాడు.

"ఆఁ! "అంటూ జనార్దనం కుర్చీలో కూలబడి పోయాడు.

"పోయిందా?" రేఖ ముకుళించిన ముఖంతో ప్రకాశ్ వైపు చూసింది.

"చివరిదాకా మనకే మెజారిటీ అనుకున్నాం. దాంతో దుంప తెగ ఆ కొత్త పాలెం మన రిజల్టుని తలకిందు చేసింది నాన్నా"

నిరాశ నిస్పృహలతో వాడిన వదనాన్ని బలవంతంగాఎత్తి ప్రకాశ్ కళ్ళలోకిచూస్తూ అన్నాడు జనార్దనం.

"కొత్తపాలెమా?"

"అవును. మనం అనుకున్నంతా అయింది. వాళ్ళమాటలు నమ్మి, వీళ్ళ మాటలూనమ్మి మోసపోయాం. మన దగ్గిర్నించి మన ఫాలోయర్స్ తీసుకెళ్ళిన నోట్లు అసలు వాళ్ళకి చేరలేదని నానమ్మకం. రాస్కెల్స్. మోసం చేశారు."

"మోసమా?" జనార్దనం కళ్ళు ఎర్రబారాయి.

"ప్రపంచమే మోసంతో నిండి ఉంది" అంది రేఖ.

"అవును. ఎవరో పతిట. ఆ కొత్త పాలెం లీడరుట. వాడెంత చెబితే ఆ గ్రామమంతా అంతేట. వాడు మనకి ఎదురు. డబ్బుముందు వాడెంత అనుకున్నాంగాని, అక్కడ డబ్బుకి విలువ లేదని తెలుసుకోలేక పోయాం, ఇప్పుడే ఎవరో అన్నారు: తీసికెళ్ళిన డబ్బు అక్కడ ఉపయోగ పడలేదని, మళ్ళీమనదాకా రాకుండా. మన ఉపగ్రహాలే స్వాహా చేశాయట. ఇప్పటి దాకా ఈవార్త బయటికి పొక్కలేదు చూశారూ,"

"ఎవడ్రా ఆపతి? అంతఘటికుడా?"

"ఎవడో నేనెప్పుడూ చూడలేదు" ప్రకాశ్ అన్నాడు.

"మన రఘుగారిది కొత్త పాలెమేట. వారికి తెలిసే వుంటుంది." అంది రేఖ రఘు వైపుచూస్తూ.

"అలాగా! ఏమోయ్ రఘూ, ఎవరా పతి? నీకు తెలుసా?"

"తెలుసండి" అన్నాడు రఘు.

"అంత మొనగాడా?" జనార్దనం రెట్టించాడు. రఘుమాట్లాడలేదు.

"ఊరందర్నీ కట్టుకువచ్చి, లక్ష్మి ప్రసన్నాన్ని నిరర్థకం చేసేటంత ఘనుడా!" రఘు మందంగా నవ్వాడు.

"ఏమిటి క్వాలిఫికేషన్?" ప్రకాశం వ్యంగ్యంగా అన్నాడు

"ఎం. ఏ."

"థర్డ్‌క్లాస్ కాబోలు, లేకపోతే ఆ పల్లెటూర్లో పడేడుస్తావా!" అన్నాడు ఈసడింపుగా.

"ఏ క్లాసయితే ఏం లెండి" అన్నాడు రఘు

నిర్లిప్తంగా మాట్లాడుతున్న రఘు వైపుచూస్తూ జనార్దన ఒక నిష్టూరం వేశాడు.

"అదేడూళ్లో ఉంటూ నాకు అక్కడ బలం లేదని తెలిసీ, నాస్తి నీ పరపతి ఉపయోగించి సహాయం చెయ్యకూడదటోయ్. ఇంతటి అం... అక్కడ ఉందని నాకు ఏమాత్రం తెలిసినా అలావచ్చి కనపడేవాడినికదా! అడగలేదని అవకాశం చూస్తూ చూస్తూ పోనిచ్చావా రఘూ?"

"క్షమించాలి" అన్నాడు రఘు

రఘు ఉనికిని గమనించినా అప్పుడుగాని ప్రకాశ్ అతనిని గురించి ఆలోచించలేదు.

"వీరెవరు"

"చెప్పాను కదూ మన రేఖకు ట్రెయిన్లో ఓపెద్ద గండం తప్పిందని అప్పుడు సమయానికి ఇతడే రక్షించాడు పాపం."

"ఓహ్ వీరేనా? గ్లాడ్‌టు మీట్ యూ మిస్టర్ రఘూ"

"గ్లాడ్‌టూ మీట్ యూ"

"ఏమండీ, అప్పుడంత సహాయం చేసినవారు, ఇప్పుడీ కాస్త సహాయాన్ని ఉపేక్షించారా?" ప్రకాశ్ అన్నాడు.

"క్షమించాలి. ఎన్నికల్లో అనేక విషయాలు ముడిపడి వుంటాయి. ఏ గ్రామంలో అయినా అనేక ముఠాలు, అనేక రాజకీయాలు, అనేక అవసరాలు వుంటాయి. సమష్టిక్షేమంకోసం వ్యక్తిగత అభిమానాన్ని పక్కకునెట్టి, ఇష్టంవున్నా, లేకపోయినా ఒక నిర్ణయం తీసుకోక తప్పదు. జనార్దనంగారిమీద ఎంత అభిమానం ఉన్నా తప్పనిసరిగా వారికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవలసివచ్చినందుకు నన్ను అర్థంచేసుకొని క్షమించమని ప్రార్థిస్తున్నాను."

అందరూ దిగ్భ్రాంతు లయారు.

"మీరా!" అంది రేఖ. "నిర్ణయం తీసుకున్నది మీరా?"

"నువ్వా!" అన్నాడు జనార్దనం.

"అవును. నేనే. నా పేరు రఘుపతి. మీరు రఘుగా నన్నెరుగుదురు. గ్రామం అభిమానంతో 'పతీ' అని పిలుస్తుంది. ఈ రెండు సంవత్సరాలనుంచీ మా నాన్నగారిమీది గౌరవాన్నంతా గ్రామ ప్రజలు నా మీదికి మళ్ళించి నన్నభిమానించారు. నా నిర్ణయాన్ని ఏకగ్రీవంగా శిరసావహిస్తామన్నారు. చిన్నా పెద్దా అలా అంటుంటే, విషయాలన్నీ సాకల్యంగా ఆలోచించి, ఊరికి మంచిదని తోచిన నిర్ణయాన్ని తీసుకోకుండా ఎలా వుండగలను? 'ఊరికి మంచిది' అనటంలో నా అభిప్రాయం—ముఠా తత్వాలు అణగద్రొక్కటానికి ఎవరికీ ఏ ముఠాకీ చెందనివ్యక్తిని యెన్నుకోవటమే. ఇంతకంటే నాకు దేశ రాజకీయాలు తెలియవు. అది మీకుకూడా తెలుసు. మీకు కష్టం కలిగించినందుకు మళ్ళీ క్షమాపణ వేడుకుంటున్నాను."

అందరివైపూ చూశాడు రఘు. అందరి వదనాల్లో లోపించిన ప్రసన్నత అతన్ని కుంగదీసింది.

"ఈసారి ఎం. పి. ఖాయం అనుకున్నాను. ప్చ్! ఎంత డబ్బు! అంతా గంగపాలు."

జనార్దనం తల చేత్తోపట్టుకున్నాడు.

"నాన్న ఎం. పి. ఐతే యీసారి స్కాలర్‌షిప్ ష్యూర్‌గా వచ్చేది. ప్చ్. ఛాన్స్ పోయింది."

అర్థస్వగతంగా గొణిగాడు ప్రకాష్.

"డెప్యూటీ మినిష్టరన్నా కావలసిన ఛాన్స్!"

రేఖ నిట్టూర్చింది.

మరోసారి అందరిముఖాల్లోకిచూసి రఘు "సెలవండీ!" అని చేతులు జోడించాడు.

అందరూ ముభావంగా ముఖాలు ముడుచుకున్నారు.

రఘు బైటికి వచ్చాడు.

వర్షం కురుస్తూనేవుంది.

మెరు పొకటి మెరిసీ మాయమైంది.

ఉరు మొకటి వురిమింది.

ఎక్కడినుంచో కోయిల సన్నాయి నొక్కు నొక్కింది.

కాకులు రొదచేశాయి.

టామీకూడా గొంతెత్తింది.

వర్షంలో తడుస్తూనే రఘు ముందుకి సాగిపోయాడు. □□□


## "కానుక"

శ్రీయుతులు చలం. మల్లాది, కొడవటిగంటి, ధనికొండ, ముళ్లపూడి కథల సంపుటి... బాపూ. గంగాధర్‌లు వేసిన రచయితల రూప చిత్రాలతో – 1/8 క్రౌన్ సైజులో సర్వాంగ సుందరంగా వెలువడింది ... ...

కూర్పు : కె. పి. బాబు

రెండురూపాయలు మనియార్డరు చేసినవారికి ఒక కాపీ రిజిష్టర్ పోస్టులో పంపబడుతుంది.

— కాపీలకు —

ఆర్. ఆర్. పబ్లికేషన్స్,

4 బి/10 వెంకటాచలాచారి స్ట్రీట్, కోమలేశ్వరన్ పేట : : మద్రాసు–2.